'సిఫారసు లేఖలకు' టీటీడీ గ్రీన్‌సిగ్నల్

- వారానికి నాలుగు లేఖలకు అనుమతి
- అంగీకరించిన సీఎం చంద్రబాబు

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలిపారు. దీంతో కొన్నాళ్లుగా తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను టీటీడీ అనుమతించడం లేదనే సమస్యకు చెక్ పడినట్టయింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం సీఎం చంద్రబాబుతో సమావేశమై సిఫారసు లేఖల అంశంపై చర్చించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వారానికి నాలుగు సిఫారసు లేఖలకు అనుమతిస్తూ టీటీడీ తీసుకున్న నిర్ణయానికి సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు. వారానికి రెండుసార్లు రూ.300 దర్శనం, రెండుసార్లు బ్రేక్ దర్శనానికి సంబంధించిన లేఖలకు అనుమతి ఇచ్చారు.

వీఆర్వోలుగా 9,654 మంది సంసిద్ధత

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో వీఆర్వోలుగా పనిచేసేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల్లో 9,654 మంది సంసిద్ధత వ్యక్తం చేశారు. వీఆర్వో వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారి నుంచి ఇటీవల విల్లింగ్ తీసుకున్నారు. ఈ నెల 28తో గడువు ముగియగా.. 3,534 మంది వీఆర్వోలు, 5,987 మంది వీఆర్ఏలు విల్లింగ్ ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి రాష్ట్రంలో వీఆర్వోలు, సర్వేయర్లను కలిపి 11,500 మంది వరకు సిబ్బందిని తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. అయితే.. విధులు, నియమ నిబంధనలు, సర్వీస్ వివరాల వంటివాటిపై స్పష్టత ఇవ్వకపోవడంతో చాలా మంది విల్లింగ్ ఇవ్వలేదు.

ఆలయాల్లో ప్రైవేటు నెయ్యికి నో!

ఆదేశాలు జారీచేసిన దేవాదాయ శాఖ

హైదరాబాద్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): ఆలయ ప్రసాదాల్లో కల్తీ నెయ్యిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ నెయ్యిని మాత్రమే ప్రసాదాల తయారీలో వినియోగించాలని స్పష్టం చేసింది. నెయ్యి సేకరించేందుకు ప్రైవేటు డెయిరీలతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి అన్ని ఆలయాల కార్యనిర్వహణాధికారుల (ఈవో)కు ఉత్తర్వులు జారీచేశారు.

'డీట్' ద్వారా ప్రైవేటు ఉద్యోగాలు

హైదరాబాద్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్)లో నమోదు చేసుకుంటే నిరుద్యోగులు నైపుణ్యాలు, విద్యార్హతలకు అనుగుణంగా ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం, చదువు పూర్తైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పించనున్నట్టు పేర్కొన్నది. ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం 'డీట్' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఇంటర్నెట్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని ఈ నెల 4న పెద్దపల్లిలో సీఎం రేవంత్ ప్రారంభించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఇందులో ఉచితంగా వివరాలు నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌తో పాటు మరిన్ని వివరాలకు డీట్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

2 నుంచి డీఎడ్ కౌన్సెలింగ్

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో సీట్ల భర్తీకి రెండో విడత షెడ్యూల్ విడుదలైంది. జనవరి 2 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని కన్వీనర్ శ్రీనివాసచారి ప్రకటనలో తెలిపారు. 2 నుంచి 4 వరకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, 9న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు 13 వరకు ఫీజు చెల్లించాలని, 16న రిపోర్ట్ చేయాలని సూచించారు.

జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు మన దగ్గరే ఎక్కువ

- సెకండరీలో డ్రాపౌట్ రేట్ అధికం
- హైస్కూల్‌కొచ్చేలోపే డ్రాపౌట్
- 8వ క్లాస్ దాటినా పైచదువులకు అనాసక్తి
- సర్కారులో ఏటా మూడు లక్షలు తగ్గుతున్న విద్యార్థులు
- వెల్లడించిన యూ డైస్ ప్లస్ నివేదిక

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో సర్కారు స్కూళ్లల్లో విద్యార్థుల నమోదు(ఎన్‌రోల్‌మెంట్) పడిపోతున్నది. ఏటా మూడు లక్షల మంది విద్యార్థులు సర్కారు బడుల నుంచి దూరమవుతున్నారు. మూడేండ్లల్లో ఆరు లక్షల మంది సర్కారు చదువులను వదులుకుని, ప్రైవేట్‌లో చేరిపోయారు. ఇక జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్యలో దేశంలో తెలంగాణ అధమ స్థితిలో ఉంది. జాతీయంగా 12వేలకు పైగా జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లుండగా.. పశ్చిమ బెంగాల్ 3,254, రాజస్థాన్ 2,167, తెలంగాణ 2,097 స్కూళ్లతో వరుసగా మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 2023-24 ఏడాదికి యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్(యూడైస్) ప్లస్ నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో సింగిల్ టీచర్‌తో నడుస్తున్నవి 5,985 స్కూళ్లున్నాయి. 8వ తరగతి దాటి పైచదువులకు వెళ్లడానికి విద్యార్థులు అనాసక్తి చూపుతున్నారు. 8వ తరగతి పూర్తిచేసిన వారిలో 11.4శాతం విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగులుతున్నారు. వీరిలో బాలురు 13.3శాతముండగా, బాలికలు 9.5శాతం డ్రాపౌట్లు అయ్యారు. 42వేల స్కూళ్లుండగా, 11.8శాతం స్కూళ్లు పది మందిలోపు విద్యార్థులతో నడుస్తున్నాయి. 500కు పైగా విద్యార్థులున్న స్కూళ్ల శాతం కేవలం 8.7శాతం మాత్రమే. ఎన్‌రోల్‌మెంట్ పడిపోవడంతో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి కూడా పడిపోయింది. విద్యార్థులు తగ్గగా, టీచర్లు ఎక్కువున్నారు. ప్రాథమిక తరగతుల్లో 19, ప్రాథమికోన్నత తరగతుల్లో 12, సెకండరీ స్కూళ్లల్లో 9, హయ్యర్ సెకండరీలో 25 మంది విద్యార్థులకు ఒక టీచర్ చొప్పున ఉన్నారు.

ఎన్‌రోల్‌మెంట్

సంవత్సరం	మొత్తం ఎన్‌రోల్‌మెంట్
2023 -24	27,79,713
2022- 23	30,09,212
2021-22	33,03,699

ఏసీబీ వలలో 170 మంది అధికారులు

- చిక్కిన వారిలో అత్యధికులు పోలీసులే
- తరువాతి స్థానాల్లో పీఆర్, రెవెన్యూ సిబ్బంది
- దోషులుగా 12 మంది నిర్ధారణ.. జైలుశిక్ష



హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రాష్ట్రంలో ఈ ఏడాది 170 మంది అధికారులను అవినీతికి పాల్పడుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు తెలిసింది. ఈ జాబితాలో పోలీసులే అత్యధికంగా ఉండటం విశేషం. వీరి తరువాతి స్థానంలో వరుసగా పంచాయతీరాజ్, రెవెన్యూ, స్టాంపులు – రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు ఉన్నారు. కానిస్టేబుల్ నుండి డీఎస్పీ స్థాయి వరకు 31 మంది పోలీసులు లంచం తీసుకుంటూ ఏసీబీ చేతికి చిక్కినట్టు సమాచారం. పంచాయతీ రాజ్‌శాఖకు చెందిన 24 మంది అధికారులు, రెవెన్యూశాఖ నుంచి 19 మంది, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి 13 మంది అధికారులు ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అవినీతికి పాల్పడిన పోలీసు అధికారుల్లో సంగారెడ్డికి చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ రూ.1.5 కోట్ల లంచం డిమాండ్ చేసి, రూ.5 లక్షలు తీసుకుంటుండగా దొరికిపోయాడు. హైదరాబాద్ సీసీఎస్‌కు చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ ఓ కేసుకు సంబంధించి రూ.15 లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.3 లక్షలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. కుషాయిగూడకు చెందిన మరో పోలీస్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఓ కేసును మూసివేయడానికి రూ.3 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

భారీ ఎత్తున అక్రమాస్తుల గుర్తింపు

అవినీతికి పాల్పడిన అధికారుల ఆటకట్టించడంలో ఏసీబీ అధికారులు ఈ ఏడాది పురోగతి సాధించారు. ముఖ్యంగా మూడు భారీ అవినీతి తిమింగళాలను బట్టబయలుచేసి వారి అక్రమాస్తులను ప్రజలకు వివరించడంలో విజయం సాధించారు. ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ముందువరుసలో ఉన్నారు. ఆయన వద్ద 214 ఎకరాల భూమి, 29 ప్లాట్లు, బ్రాండెడ్ వాచ్‌లు, ఐఫోన్‌లు వంటి విలాసవంతమైన వస్తువులతో సహా రూ.250 కోట్ల విలువైన ఆస్తులను కనుగొన్నారు. ఆ తర్వాత నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన నికేశ్‌కుమార్ నుంచి సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ సీసీఎస్‌కు చెందిన ఒక ఏసీపీ నుంచి రూ.3.95 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు కనుగొన్నారు. ఇక లంచాలు తీసుకున్న కేసుల్లో 12 మంది అధికారులు దోషులుగా నిర్ధారణ అయ్యారు. వారికి ఏడాది నుంచి నాలుగేండ్ల వరకు జైలు శిక్షలు పడ్డాయి.

తెలంగాణకు సహకారాన్ని కొనసాగిస్తాం

- ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో భాగస్వామిగా ఉంటాం
- సీఎం రేవంత్‌రెడ్డికి మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల హామీ

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలన్న తమ నిబద్ధతను కొనసాగిస్తామని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని బృందం సోమవారం హైదరాబాద్‌లో సత్య నాదెళ్ల నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. సత్య నాదెళ్ల మాట్లాడుతూ.. నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్-50 నగరాల్లో ఒకటిగా నిలుపుతాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాము హైదరాబాద్‌లో 10 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామని, 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డాటా సెంటర్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను పెంచుతున్న సత్య నాదెళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. టెక్నాలజీ డొమైన్‌లో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలపడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్నదని పేర్కొంటూ.. ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్‌తో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మైక్రోసాఫ్ట్ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

11 నెలల్లో 14మంది నక్సల్స్ హతం

- ఏడాది పాలనలో మావోయిస్టులపై ఉక్కుపాదం
- 16 మందిని చంపారంటున్న పౌరహక్కులు సంఘం

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యం, ప్రజాహక్కుల పునరుద్ధరణే మా 7వ గ్యారెంటీ అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఏడాది పాలనలో 14 మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల ఘటనల్లో మృతి చెందినట్టు అధికారికంగా వెల్లడించింది. గత 11 నెలల్లో మొత్తం నాలుగు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు హతమైనట్టు వార్షిక క్రైమ్ నివేదికలో వెల్లడించింది. మృతుల్లో ఒక కేంద్ర కమిటీ సభ్యుడు, ఇద్దరు డివిజన్ కమిటీ సభ్యులు, ఐదుగురు ఏసీఎంలు, ఆరుగురు డీఎంలు ఉన్నట్టు తెలిపింది. వారి నుంచి 24 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంది. మొత్తంగా 85 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని, వారిలో ఒకరు స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, ఒకరు రాష్ట్ర కమిటీ సభ్యుడు, మరొక రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఉన్నట్టు వెల్లడించింది. మొత్తం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపింది. కాగా గత 11 నెలల కాలంలో 16 మందిని బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చారని పౌరహక్కుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. కోవర్టుల ద్వారా మత్తుమందు పెట్టి మావోయిస్టులను నిర్బంధించి, ఆపై కాల్చి చంపుతున్నారని పేర్కొంటున్నారు.

7.46 కోట్ల విలువైన ఔషధాల సీజ్

- డీసీఏ చట్టాల ఉల్లంఘనలపై 573 కేసులు
- వార్షిక నివేదికలో డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) చట్టాలను ఉల్లంఘించినవారిపై ఈ ఏడాది 573 కేసులు నమోదు చేసినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంగళరావునగర్‌లోని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన డీసీఏ వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. నకిలీ మందుల తయారీపై 8, ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై 79, నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ముద్రించిన కంపెనీలపై 199, నకిలీ వైద్యులపై 136, అనుమతి లేని మెడికల్‌షాప్‌లు, ఔషధ గోదాములపై 98, ఆహార ఉత్పత్తుల ముసుగులో ఔషధాల తయారీపై 44 కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. చట్టాలను ఉల్లంఘించిన కంపెనీలు, మెడికల్ షాపులు, ఏజెన్సీల వద్ద నుంచి 7.46 కోట్ల విలువైన ఔషధాలను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలపై నిఘా పెట్టినట్టు తెలిపారు. 42 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

విషపూరిత వ్యర్థాలు ఇండోర్‌కు తరలింపు

మధ్యప్రదేశ్ హైకోర్టు ఆగ్రహంతో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం

భోపాల్, డిసెంబర్ 30: భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగిన 40 ఏండ్ల తర్వాత ఆ ఫ్యాక్టరీలోని విషపూరిత వ్యర్థాల నిర్వహణపై అక్కడి పాలకులు చర్యలకు ఉపక్రమించారు. మధ్యప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత.. అధికారులు విషపూరిత వ్యర్థాల్ని ఇండోర్‌కు తరలిస్తున్నారు. భోపాల్‌కు 250కి.మీ దూరంలోని పితాంపూర్ వద్ద 377 మెట్రిక్ టన్నుల యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ విషపూరిత వ్యర్థాల్ని దహనం చేయబోతున్నారు. పనుల్ని ప్రభుత్వం ఆదివారం నుంచి ప్రారంభించింది. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మరో విషాదం చోటుచేసుకోకముందే వ్యర్థాల్ని ఇండోర్‌కు తరలించాలని డిసెంబర్ 3న హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

నల్లగొండలో మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

జర్నలిస్టులకు మెరుగైన హెల్త్ కార్డుల జారీ

- ఇండ్ల స్థలాల విషయంలో వాస్తవాలు గ్రహించకుండా సుప్రీం తీర్పు విచారకరం
- మీట్ ది ప్రెస్‌లో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నీలగిరి, డిసెంబర్ 30 : రాష్ట్రంలోని జర్నలిస్టులకు వైద్య సదుపాయం విషయంలో స్పష్టమైన విధానాన్ని తీసుకురానున్నట్టు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జర్నలిస్టుతోపాటు వారి కుటుంబసభ్యులు, తల్లిదండ్రులకు రూ.పది లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తించేలా మెరుగైన హెల్త్‌కార్డులు తీసుకురానున్నట్టు చెప్పారు. దేశంలో జర్నలిస్టులు, ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను ఒకే తాటిపైకి తెచ్చి ఇండ్లస్థలాల విషయంలో సుప్రీం తీర్పు నిరాశ పర్చిందని అభిప్రాయపడ్డారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి అధికారులతో స్వచ్ఛందంగా ప్రజల కోసం పని చేసే జర్నలిస్టులను కలిపి తీర్పు ఇవ్వడం దురదృష్టకరమని చెప్పారు. సోమవారం నల్లగొండ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. మీడియా సంస్థలు తమ స్వభావాన్ని కోల్పోయి రాజకీయ పార్టీలకు అనుసంధానంగా పని చేయడంతో జర్నలిస్టులు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతున్నారన్నారు. చాలా వాస్తవాలు సోషల్ మీడియా ద్వారానే ప్రజలకు తెలుస్తున్నాయని చెప్పారు. సోషల్ మీడియాలోని మంచి సంస్థలకు ప్రభుత్వం ఒక పాలసీని తీసుకొస్తున్నదని పేర్కొన్నారు.

10 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గ్రేహౌండ్స్ విభాగంలో ఏఎస్పీ హోదాలో విధులు నిర్వర్తిస్తున్న 10 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 9 మందికి ఆయా జిల్లాల ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. అంకిత్ కుమార్ శంఖ్వార్‌ను డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు.

పేరు	ఏఎస్పీగా బదిలీ స్థానం
కాజల్	ఉట్నూర్
కంకనాల రాహుల్‌రెడ్డి	భువనగిరి
ఎస్ చిత్తరంజన్	ఆసిఫాబాద్
బీ చైతన్యరెడ్డి	కామారెడ్డి
పందేరి చేతన్ నితిన్	జనగామ
విక్రాంత్‌కుమార్ సింగ్	భద్రాచలం
నగ్రాలె శుభం ప్రకాశ్	కరీంనగర్ రూరల్
రాజేశ్ మీనా	నిర్మల్
పీ మౌనిక	దేవరకొండ

ముదిరాజ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కమిటీ ఏకగ్రీవం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ముదిరాజ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. విన్‌ఫ్లోరా హోటల్‌లో సోమవారం రాష్ట్ర సంఘం ఎన్నికల్లో కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటేశ్ (కొడంగల్ సీఐ, ఎక్సైజ్), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీ జంగయ్య(సీఐ), ఉపాధ్యక్షులుగా పీ వెంకటయ్య (ఏసీ, వాణిజ్యశాఖ), ఎం సురేందర్(ఏఈ, విద్యుత్ శాఖ), వీ ధనరాజ్ (జేఏ, సీఐడీ), రాష్ట్ర కోశాధికారిగా ఆర్ మహేశ్వర్(ఎస్‌టీవో, ట్రెజరరీ శాఖ), రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సురేశ్‌బాబు (సీఐ), కే విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు పీ శ్రీనివాస్(ఈఎస్‌ఐ వైద్యశాఖ), కే రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బీ వెంకటేశ్వర్లు, ఎస్ అశ్విని కుమార్, శివ, బీ ప్రసాద్, శ్రీరాము, కో-ఆర్డినేటర్‌గా టీ మహేశ్‌రాజ్ ఎన్నికయ్యారు.

ప్రేమికుల ఆత్మహత్య!

నవాబ్‌పేట, డిసెంబర్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామంలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన చాకలి అంకిత (18) పాలమూరు ఎన్టీఆర్ మహిళా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నది. అదే గ్రామానికి చెందిన చందుకుమార్ (20) జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతుండగా.. ఇద్దరూ రెండేండ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో అంకిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలిసిన చందు మనస్తాపంతో అదే రోజు రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం మృతి వార్త వ్యాపించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇద్దరి కుటుంబ సభ్యులు వేర్వేరుగా ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విక్రమ్ తెలిపారు.

పూజారులకు నెలకు రూ.18 వేలు

- ఢిల్లీలో ఆప్ ఎన్నికల హామీ

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను ఆకర్షించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ అనేక వాగ్దానాలు చేస్తున్నది. హిందూ దేవాలయ పూజారులకు, గురుద్వారా గ్రంథిలకు నెలకు రూ.18,000 గౌరవ వేతనం చెల్లిస్తామని వాగ్దానం చేసింది. ఆ పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఇదంతా రాజకీయ స్టంట్ అని బీజేపీ, కాంగ్రెస్ ఎద్దేవా చేశాయి.

'తాత్కాలిక సీఎం' వ్యాఖ్యలపై దుమారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఢిల్లీ సీఎం ఆతిశీని తాత్కాలిక సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించడంపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామిక స్ఫూర్తిని, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఘోరంగా అవమానించడమేనని విమర్శించారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలు సీఎంగా మిమల్ని నియమించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును, రాష్ట్రపతి ప్రతినిధిగా తనను అవమానించడమేనని ఆతిశీకి రాసిన లేఖలో సక్సేనా పేర్కొన్నారు.

పెరిగిన ఎమ్మెల్సీ ఎలక్టోల్స్ 31452

- మూడు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ప్రకటన
- తుది జాబితా వెల్లడించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి



హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరుగనున్న రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి తుది ఎలక్టోల్స్ జాబితాను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సీ సుదర్శన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. గత ఎన్నికలకు, తాజా తుదిజాబితాకు సంబంధించి మూడుచోట్లా 31,452 ఎలక్టోల్స్ పెరిగినట్టు తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల తుది ఓటర్ల ఎలక్టోల్స్ జాబితాను ఆయన వెల్లడించారు. నవంబర్ 23 నుంచి ఈ నెల 9 వరకు తమ కార్యాలయానికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్స్ ప్రకారం నియోకవర్గాల వారీగా తుది జాబితా కిందివిధంగా ఉన్నట్టు వివరించారు.

నియోజకవర్గాల వారీగా పెరిగిన ఎలక్టోల్స్..

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో పెరిగిన ఎలక్టోల్స్ 26,782 మంది ఉండగా, ఇందులో పురుషులు 16,507, స్త్రీలు 10,273, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో పెరిగిన ఎలక్టోల్స్ 2,319 ఉండగా, పురుషులు 1,258, స్త్రీలు 1,061, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో పెరిగిన ఎలక్టోల్స్ 2,351ఉండగా, పురుషులు 1,442, స్త్రీలు 909 ఉన్నట్టు సీఈవో వివరించారు.

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్(పట్టభద్రుల నియోజకవర్గం)

పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్‌లు	మొత్తం
499	2,18,060	1,23,250	3	3,41,313

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్(ఉపాధ్యాయ నియోజకవర్గం)

పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్‌లు	మొత్తం
274	16,364	9557	--	25,921

వరంగల్, ఖమ్మం, నల్లగొండ(ఉపాధ్యాయ నియోజకవర్గం)

పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్‌లు	మొత్తం
200	14,940	9965	--	24,905

తగ్గిన ఫైర్‌కాల్స్.. మరణాల సంఖ్య

- 2024లో 7,383 ఫైర్‌కాల్స్
- వార్షిక నివేదిక విడుదల చేసిన అగ్నిమాపకశాఖ డీజీ

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుడు ఫైర్‌కాల్స్ తగ్గాయి. 2023లో అగ్నిప్రమాదాల్లో 44 మంది చనిపోగా, ఈ ఏడాది 23 మంది మరణించినట్టు అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోమవారం అగ్నిమాపకశాఖ వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ ఏడాది 63 మందిని అగ్నిప్రమాదాల నుంచి కాపాడినట్టు వెల్లడించారు. గతేడాది 7,400 ఫైర్ కాల్స్ రాగా, ఈ ఏడాది 7,383 వచ్చినట్టు తెలిపారు. నిరుడుతో పోల్చితే మీడియం ఫైర్ కాల్స్ 10శాతం పెరిగినట్టు నాగిరెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది అనూహ్యంగా వచ్చిన వరదల్లో 1,767 మందిని రెస్క్యూ చేసినట్టు తెలిపారు. అగ్నిప్రమాదాల్లో కాకుండా ప్రమాదశాత్తు చనిపోయిన 435 మంది డెడ్ బాడీలను అగ్నిమాపకశాఖ సిబ్బంది రికవరీ చేసినట్టు చెప్పారు. మొత్తంగా 15,78,433 ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. అగ్నిమాపకశాఖ ట్రైనింగ్ అకాడమీని రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించినట్టు వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్ తరహాలో రాష్ట్రంలో 2వేల మందితో ఎస్డీఆర్ఎఫ్‌ను రూపొందించామని తెలిపారు. అడిషనల్ ఫైర్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, ఆర్ఎఫ్‌వో హరినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్

రామగిరి, డిసెంబర్ 30 : నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం 2024-26 నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, ఉపాధ్యక్షులుగా జంగయ్య, దుర్గాభవాని, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా రాములు, సోమశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, శాంతికుమారి, సమ్మారావు, సత్యానంద్, నాగమణి, రాజు, రంజిత్‌కుమార్, రవిప్రకాశ్‌గౌడ్, మల్లారెడ్డి, రవికుమార్, శ్రీధర్, సింహాచలం, జ్ఞానమంజరి, వెంకటప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జాకటి యాకయ్య, సభ్యులుగా లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రఘుపాల్, శంకర్, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. వాయిస్ ఆఫ్ తెలంగాణ ప్రతిక ప్రధాన సంపాదకుడిగా పాపన్నగారి మాణిక్‌రెడ్డి, కుటుంబ సంక్షేమనిధి చైర్మన్‌గా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సిలివేరు అనిల్‌కుమార్, కోశాధికారిగా సైదులును నియమించారు. ఎన్నికల అధికారిగా మస్తాన్‌రావు, పరిశీలకుడిగా కిష్టయ్య వ్యవహరించారు.